వ్యంగ్య రచన

# దిబ్బరాజుగారి ప్రతిష్ఠ

కొడవటిగంటి కుటుంబరావు

ప్రభువువారు ఎడమచేతిలో ఉన్న సాసరు నుంచి కుడిచేత్తో కప్పు ఎత్తి నోటిదగ్గిరికి తీసుకునే పద్ధతిలో నాకేదో విచార సూచన కనపడింది.

కిరీటధారికి మనశ్శాంతి లేదన్న ఆంగ్లసూక్తి ఆయనకు వినపడేటట్టు పఠించా.

ఆయన నాకేసి క్షణంసేపు పరధ్యానంగా చూసి, సంగ్రహమైన చిరునవ్వొకటి నవ్వి, 'మీకు తెలియని విషయాలేమున్నాయి?' అన్నారు.

'వాటిలో ప్రస్తుతం మీ కోమల హృదయాన్ని వేధిస్తున్నది ఏదా అని' అన్నా.

ఆయన దగ్గిర దాపరికం లేదు. ఉన్న చిక్కేమిటో చెప్పేశారు.

సంగతేమంటే దిబ్బనగరానికి ఉత్తరంగా అరణ్యమున్నది. దానికింకా ఉత్తరంగా కొండలున్నాయి. వెనక ఈ అరణ్యంలోనూ, కొండల్లోనూ వన్యమృగాలుండి ప్రభువువారూ, ఆయన మిత్రులూ అప్పుడప్పుడూ షికారీ చేస్తుండేవారు. ఇప్పుడక్కడ కమ్యూనిస్టులు కూడా చేరారు.

ప్రభువువారి ఆజ్ఞానుసారం కిందటేడు వరకూ దిబ్బపోలీసులూ, దిబ్బసైనికులూ ఈ ప్రాంతాలలో కమ్యూనిస్టుల వేట సాగించారు. 1949 మధ్యలో ఈవేట అకస్మాత్తుగా ముగిసింది. అరణ్యంలోనూ, కొండల్లోనూ గల కమ్యూనిస్టులు నిశ్శేషం చేయబడ్డారని అధికార ప్రకటన జరిగింది. ఆ ప్రాంతాలలో నివసించే కోయలూ, చెంచులూ మొదలైనవాళ్లు తమకు కమ్యూనిస్టు భయం తీరిపోయిందన్నారట.

కాని యదార్థంగా జరిగినదేమంటే దిబ్బ పోలీసులకూ, దిబ్బ సైనికులకూ అరణ్యంలో కమ్యూనిస్టులుగా గుర్తించదగిన వాళ్లెవరూ కనిపించలేదు. వాళ్లు చేసిందల్లా కనిపించిన కోయవాణ్ణీ, చెంచువాణ్ణీ చంపారు.

'మా జీవితం ఎందుకిట్లా తారుమారు చేస్తున్నారు? ఇదివరకు ప్రభువువారు షికారీ వస్తే మేం తోడ్పడి ఏదో బహుమానాలం పొందేవాళ్ళంగదా. ఇప్పుడు మామీదికే వేటకు వచ్చి మాకు తుపాకిగుళ్లు బహుమానం చేస్తున్నారా?' అని వనవాసుల్లో పెద్దలు అడిగారు.

'మాకు మీతో పేచీలేదు. మీరు కమ్యూనిస్టుల్ని దాస్తే వాళ్ళతోబాటు మీరు కూడా బాధలు పడవలసి ఉంటుంది' అని దిబ్బప్రభువుగారి అధికార్లు వారికి తెలియజెప్పారు.

ఇది అతిశయోక్తి. దిబ్బసైన్యాల దాడుల వల్ల కమ్యూనిస్టులేమీ బాధపడ్డట్టు కనిపించలేదు. బాధలన్నీ వనవాసులే పడ్డారు.

అరణ్యంలో కమ్యూనిస్టులు లేరనికాదు. ఉన్నారు. ఉండటమే కాకుండా దూరంగా ఉన్న ప్రాంతాలలో నివసించే అడివి మనుష్యులకు వ్యవసాయమూ, చదువు సంధ్యలూ, చిన్న చిన్న గృహపరిశ్రమలూ నేర్పసాగారు.

అరణ్యవాసులు కమ్యూనిస్టులపై అభిమానంతో కాకపోయినా, ఆత్మరక్షణార్థం దిబ్బ సైనికులపైనా, పోలీసులపైనా కత్తి కట్టారు. చాలామంది పోలీసులూ, సైనికులూ వాళ్ళ చేతిలో చచ్చారు. అంతకంటె ఎక్కువగా పోలీసులూ, సైనికులూ అరణ్యంలోకి కొండల్లోకి పారిపోయి అక్కడి నూతన జీవితంలో చేరిపోయినారు. ప్రభుత్వ నౌకరీ చేసుకునేవాళ్ళకన్న ఈ అరణ్యవాసులు సార్థకంగా జీవిస్తున్నట్టు వారికి తోచింది. ఈ విధంగా అరణ్యవాసులకు ఒకటి రెండు జీప్ కార్లూ, కొన్ని డజన్ల తుపాకులూ, కొన్ని పెట్టెల తూటాలూ అవీ దొరికాయి.

అడవుల్లోనూ కొండల్లోనూ కమ్యూనిస్టులున్నారని అందరికీ తెలుసు. కాని వాళ్ళు అకృత్యాలేమీ చెయ్యకపోవటంచేత పూర్తిగా నిర్మూలించబడ్డారన్న అధికార ప్రకటనకు

విఘాతం లేకపోయింది. వాళ్ళో వాళ్ళ ఏజంట్లో ప్రతిరాత్రీ ఆహారధాన్యాలూ, పళ్లూ, తేనె మొదలైనవి తెచ్చి దిబ్బనగరంలో అమ్మి తెల్లారే లోపుగా పెట్రోలూ, కిరసనాయిలూ, ఇతర అవసర వస్తువులూ తీసుకుపోతూనే ఉన్నారు. ఈ వ్యాపారంలో ప్రభుత్వ ఉన్నతోద్యోగులకు కూడా సంబంధ మున్నది.

ఈ వ్యవహారమంతా ఇట్లా నడిచిపోతే దిబ్బప్రభువుగారికి ఆట్టే బాధ ఉండేదికాదు. ఆయన శాంతిప్రియుడు. కావాలని లేనిపోని చిక్కులు తెచ్చిపెట్టుకోడు.

కాని పెద్ద చిక్కు వచ్చింది. దిబ్బరాజ్యానికి వచ్చిన పరాయివాళ్లలో ఎవరో ఒకరు పత్రికలలో ఒక వ్యాసం ప్రచురించారు. అందులో దిబ్బరాజ్యంలోని ప్రజల జీవితమూ, దానికి ఉత్తర ప్రాంతంలో ఉండే కొండ ప్రాంతంలో కమ్యూనిస్టులు ఏర్పాటుచేసిన జీవితమూ పోల్చబడింది. దిబ్బప్రభువుగారి 'పాలనాయంత్రం' గురించి లేఖకుడు కొన్ని ఘాటయిన మాటలు కూడా అన్నాడు. నిరంకుశత్వం, అవినీతి, అరాజకం, మధ్యయుగ సంస్కృతి, అసమర్థత, బాధ్యతారాహిత్యం, జమీందారీ వ్యవస్థలోని కుళ్ళు మొదలైన మాటలు విరివిగా వాడబడ్డాయి. ఈ వ్యాసంలోని ప్రధానభాగాలను ప్రెస్ ఏజెన్సీవాళ్ళు ప్రచారం చేశారు కూడా.

'ఇది దుర్భరం. దుస్సహం! కోయలూ, చెంచులూ చదువుకోవట మేమిటి? వాళ్ళ పాటలు కట్టట మేమిటి? ఇళ్ళు కట్టుకోవట మేమిటి? ఇక నాగరికత అనేది మిగులుతుందా?' అన్నారు ప్రభువుగారు.

ప్రభువుగారు వాళ్ళ పాటల్ని గురించి అన్నారే, ఆ పాటల్లో ఒకటిపైన చెప్పిన వ్యాసంలో పూర్తిగా, అర్థంతోసహా, ఇవ్వబడింది. దానిసారాంశ మేమిటంటే: అనేక పుణ్యకార్యాలు చేసి, ప్రజాశత్రువులకు అనేక మాన్యాలూ, ఉద్యోగాలూ ఇచ్చి, ప్రజలను తిండినుంచీ, బట్టనుంచీ, నిలవనీడనుంచీ, ఆరోగ్యం నుంచీ, అక్షరాస్యతనుంచీ రక్షించి, వారు నాగరికత పాలుకాకుండా వెయ్యి పోలీసు కళ్ళతో కనిపెట్టి ఉండిన దిబ్బరాజుగారు—ఆయన ఆత్మ శాంతించుగాక!—దేహం విడిచి అమెరికన్ సూపర్ ఫోర్ట్రెస్ బాంబర్ విమానంలో స్వర్గానికి వెళ్లారట. ధర్మసంస్థాపనలో క్షణంకూడా విశ్రాంతి సహించని శ్రీవారు స్వర్గంలోని అధికారులను కమ్యూనిస్టులు ఎక్కడ ఉంటారని అడిగి వారు సహజంగా నరకంలోనే ఉంటారని తెలుసుకున్నారట. అంతట శ్రీవారు నరకంలోని కమ్యూనిస్టులను నిశ్శేషం చేసేదాకా నిద్రపోనని బయలుదేరి నరకానికి వెళ్ళి అక్కడ ప్రతి నరక కూపాన్నీ పరిశోధించటం మొదలుపెట్టి; అక్కడ కూడా ఆయనకు కమ్యూనిస్టులు కనిపించక, గడువు లేకుండా అక్కడే ఉండిపోయారట.

ఈపాట దిబ్బసైన్యాలూ, దిబ్బపోలీసులూ కమ్యూనిస్టు వేటసాగించే కాలంలో రాసినది.

'పరిపాలించటానికి ఒక అర్హత ఉండాలనీ, అందరూ పరిపాలించలేరనీ, చివరకు వడ్రంగం చెయ్యటానికైనా ఒక అర్హత ఉండాలనీ ఈ మూఢ ప్రజలు ఎప్పటికి గుర్తిస్తారు? హేయమైన ఈ కమ్యూనిజంపై వీళ్ళకి అభిమాన మేమిటి? ఈ కోయలూ చెంచులూ అనాగరికులుగా ఉన్నప్పుడు ఆదర్శప్రాయులుగా ఉండేవారు. వారికి అబద్ధం ఆడటం చాతకాదు. అన్నమాట నిలబెట్టుకునేవారు. వారి స్వామిభక్తి ఎటువంటిదంటే అవసరమైతే పీకకోసి ఇచ్చేవారు. వాళ్ళు చలికీ, వానకూ, ఆకలికీ వెరిచేవారుకారు. అడవిలోని సంపద యావత్తూ తెచ్చి మనకు కానుక సమర్పించేవారు. ఇటువంటివారికి ఈ కమ్యూనిస్టు కిరాతకులు స్వార్థం నేర్పుతున్నారు, స్వామిద్రోహం నేర్పుతున్నారు, రాయటమూ, చదవటమూ, ఎండ వానలనుంచి రక్షించుకోవటమూ నేర్పుతున్నారు. ఈ అరాజకం ఇట్లాగే సాగనిస్తే వాళ్ళకూ మనకూ తేడా లేకుండా పోతుందే! వాళ్ళకోసం నా హృదయం ఎట్లా తపిస్తోందో తెలుసా?' అన్నారు ప్రభువుగారు.

'నాకు వేరే చెప్పాలా?' అన్నా.

'ఈ కమ్యూనిస్టు నిర్మాణాన్ని సమూలంగా నాశనం చెయ్యాలి.'

'దానికి సందేహ మేమిటి? ఇంకా చూస్తారెందుకు?'

'అది సులభంకాదు. అనుకున్నంత సులభం కాదు' అన్నారు రాజుగారు బరువుగా. ఎవరను

కున్నంత సులభంకాదో వారు వివరించలేదు.

'ఎందుచేతా?'

వాళ్ళకు బలాలున్నాయి, ఆయుధాలున్నాయి. వాళ్ళు చావటానికి సిద్ధంగా ఉన్నారు. మన యోధులు ప్రాణంమీద ఎందుచేతో అంతులేని అభిమానం కనబరుస్తున్నారు. నా రాజ్యంలో చావటానికి సిద్ధంగా లేనివాడున్నాడనుకోవటం ఎంతో తలవంపులుగా ఉంది. తిండిలేక చావటానికి ప్రజలు వెనకాడుతున్నారు. కమ్యూనిస్టులతో పోరి చావటానికి పోలీసులు వెనకాడుతున్నారు. నా రాజ్యంలా ఇవాళ నా రాజ్యంలో ప్రతి ఒక్కడికీ ఒకటే ఆలోచన—నాలాగే జీవించాలనీ. నేను వేసుకునే దుస్తులే వేసుకోవాలనీ, నేను పడుకున్న పక్కమీదే పడుకోవాలనీ! ఇటువంటి అరాజకం ఎన్నడూ ఎక్కడా ఎవరూ ఎరగరు.'

రాజుగారు కాస్సేపు ఆలోచించి, 'ఒక్క చిన్న సలహా కావాలి,' అన్నారు.

'ఆజ్ఞాపించండి,' అన్నా.

'కమ్యూనిజమును ఎదుర్కొనేటందుకు మనకు అమెరికా సహాయపడితే బాగుంటదూ?'

'మీకు తెలియనిదేమున్నది కనకా? వాళ్లు కొన్ని షరతులు పెడతారు.'

'పెట్టనివ్వండీ!'

'సైనిక స్థావరాలు అడుగుతారు.'

'ఇద్దాం!'

'మన గనులూ, అరణ్యాలూ, పరిశ్రమలూ గుత్త తీసుకుంటారు.'

'తీసుకోనివ్వండీ!'

కమ్యూనిస్టు పీడాబాధితులు ఏ షరతులకు జంకుతారు గనక? అమెరికాకు అన్ని పెట్టుబడిదారీ దేశాలూ అమ్ముడు పోతున్నాయని రష్యా ప్రచారం చేసి ఏం లాభం? కమ్యూనిస్టు ప్రమాదం రష్యాకేం తెలుసు?

'మన విడిదిలో ఉన్న ఐక్యరాజ్యీయులకు కదిలిస్తే బాగుంటుందని నాకు తోస్తోంది,' అన్నా.

'ఐక్య-ఎవరూ' అన్నారు రాజుగారు.

'ఐక్య రాజ్యీయులు. అంటే అమెరికన్ల మాట.'


'అదేం?'


RESA

నమ్మకముగా పనిచేయుటలోను, సహజమైన మధుర ధ్వనుల నందించుటలోను పేరెన్నిక గన్నది.

రీసా రేడియో

మాడల్ A. W. 5.



ఎ. సి., ఎ. సి./డి. సి. రకములు దొరకును. ప్రపంచములోని అన్ని కేంద్రములు వినవచ్చును.

వెల రూ. 360/-

బేటరీ రేడియోలు కూడా కలవు.

యం. డబ్ల్యూ. 6 ఎ. సి., ఎ.సి./డి. సి. ఇండియాలోని కేంద్రము లన్నింటిని వినవచ్చును.

వెల రూ. 230/-

మిగతా వివరములకు :

రీసా కంపెనీ

36, హారింగ్టన్ రోడ్

మద్రాసు–10

తంతి: అసెంబ్లర్. పోస్టుబాక్సు నెం. 1004.

'మీరు పేపర్లలో చూసే ఉంటారు. ఐక్య రాజ్య సేనలు స్థావరా లేర్పరచుకుంటున్నా యనీ, ఎదురు దెబ్బ తీస్తున్నా యనీ, ముందుకూ, పక్కకూ, వెనక్కూ కదులుతున్నా యనీ వార్తలు వస్తున్నాయే ఇది ఏ సేనలంటారు?'

'నిజమే, నిజమే. మనం మన అతిథులను ఐక్యరాజ్యీయు లనటమే మర్యాదగా ఉంటుంది. చాలా మంచి సూచన' అన్నారు రాజాగారు.

ఆ రోజు రాత్రే ఐక్య రాజ్యీయులు రాజా గారితో విందు తాగారు.

'మీకు అర్జంటుగా సహాయం కావాలన టానికి సందేహం లేదు అమెరికా ప్రభుత్వం మీవంటి వారికి సహాయం చెయ్యటానికేవున్నది. కాని అమెరికా ప్రజాస్వామిక దేశం కనక ప్రభుత్వంద్వారా మీకు సహాయం జరగాలంటే చాలా ఆలస్యమై కాలాతీత మవుతుంది. ఈలోగా కమ్యూనిస్టులు మిమ్మల్ని మింగేస్తారు. అందుచేత మేం మా 'కార్ప్స్ అండ్ కాఫిన్ ఇన్కార్పొరేటెడ్' ద్వారా మీకు కావలసిన సహాయం ఏర్పాటు చేస్తాం. మీ మాంగనీజ్, గంధకం గనులూ, మీ అరణ్యాలూ అభివృద్ధి చేయటానికిగానూ మా 'కార్ప్స్ అండ్ కాఫిన్' సంస్థకు అధికారా లివ్వండి, అన్నారు ఐక్య రాజ్యీయులు.

వారు రాజకీయంగా కూడా సలహాయిచ్చారు.

'మీకు మా సహాయం మొదటి ఇన్స్టాల్మెంటు సరిగా నెల రోజులకు అందుతుంది. అది వచ్చేదాకా ఆగటం చూసేవారికి బాగుండదు. మీరు వెంటనే కమ్యూనిస్టు ప్రాంతాలపై దాడి ప్రారంభించండి. ఈలోగా సహాయం రానే వస్తుంది.'

ఈ ఐక్యరాజ్య సలహా రాజాగారికి బాగా నచ్చింది. మూడో రోజుకల్లా కొండ ప్రాంతాలపై సైనిక చర్య ప్రారంభమయింది. కాని ఏ కారణంచేతనో కమ్యూనిస్టులు ఈ దాడిని సులభంగా తిప్పికొట్టి సైనికుల్లో సగం మందికి పైగా ఖైదు చేశారు. కొందరు తమకు తామే కమ్యూనిస్టులతో చేరిపోయారు. ముప్పైమంది సైనికులు కాబోలు తిరిగివచ్చారు. ఎవరిదగ్గిరా ఒక్క ఆయుధంకూడా లేదు. ఆయుధాలన్నీ, పత్రికల్లో రాసినట్టు, కమ్యూనిస్టుల పరమైనా యని భావించబడింది.

'మనం ఇంకా ఓడిపోలేదు. మన గనులూ, అరణ్యాలు ఐక్య రాజ్యీయుల పరం చేశాం. వారప్పుడే గనుల్లోనుంచి పదివేల టన్నుల మట్టి, అడవుల్లో నుంచి రెండు లక్షల టన్నుల కలప పంపించేశారు. నేడో రేపో మనకు ఆయుధ సహాయం రానున్నది' అన్నారు ప్రభువుగారు.

ఐక్య రాజ్యీయులు ఆడితప్పరు. వారు కొన్ని విషయాలలో కోయలకూ, చెంచులకూ తీసిపోరు. సరిగా అనుకున్న సమయానికి మూడు పెద్ద కేసులు దిగాయి. ఒకదానిమీద 'డ్రగ్స్' అని ఉంది. ఇంకోదానిమీద 'గ్లాస్' అని ఉన్నది. మూడోదానిమీద 'టూల్స్' అని ఉన్నది

రాజాగారు స్వయంగా దగ్గరఉండి దివాణంలో కేసులు పగలగొట్టించారు. కేసులమీద రాసిన మాటలు చూసి ఆయన నవ్వారు. అట్లా ఎందుకు రాసి ఉన్నదో ఆయనకు తెలుసు.

కాని తీరా కేసులు విప్పిన తరవాత ఆయన ఆశ్చర్యానికి మేరలేదు. ఒక కేసునిండా విటమిన్ బిళ్లలున్నాయి. రెండవ దాన్లో లాంతరు చిమ్నీలూ, వైన్ గ్లాసులూ గాజు లోటాలూ ఉన్నాయి. మూడోదాన్లో అన్నీ స్క్రూడ్రైవర్లే.

రాజాగారు ఆగ్రహం పట్టలేకపోయినారు. ఐక్యరాజ్యీయులను పిలిపించారు.

'ఏమిటీ దురన్యాయం!' అన్నారు రాజాగారు.

ఐక్యరాజ్యీయులు మరింత ప్రజాస్వామికంగా మండిపడ్డారు.

'మే మింతకంటె ఏం సహాయం చెయ్యగలం? మీరు వట్టి అసమర్థులు. ఇటీవల మీరు కమ్యూనిస్టులమీద చేసిన దాడి ఫలితంగా ఒక్క కమ్యూనిస్టు చావకపోగా, మీ సైనికులు వారి వైపు వెళ్లారనీ, ఆయుధాలన్నీ వారి పరమైనా యనీ తెలిసింది అటువంటప్పుడు మేం మీకు నిజమైన ఆయుధా లివ్వకపోవటంవల్ల మీ కెంత లాభం? అతినవీనమైన మా ఆయుధాలు వాళ్ళకి దొరికితే కమ్యూనిస్టుల్ని మీరు ఎన్నటికీ గెలవలేరు' అన్నారు ఐక్యరాజ్యీయులు.